



తెలుగు దినపత్రిక

# వార్త నిర్భయం

సామాన్యుని చేతిలో సామాజిక అస్త్రం!

www.vaarhtanirbhayam.com

ఎడిటర్ కాడేపాగు అశోక్

ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ





తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్ సంపుటి : 01 సంచిక : 129 చీఫ్ ఎడిటర్: కాడేపాగు అశోక్ పేజిలు : 04, వెల రూ. 4రూ/ సోమవారం- 06 - ఏప్రిల్- 2026

Published From Kurnool : Circulated at 'Kurnool Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram,


### కాంగ్రెస్ కు 'బబ్బర్ షేర్' ప్రచారం

## మా ప్రత్యర్థులకు నిద్రపట్టడం లేదు

- అసోంను ఏకం చేయటానికి సంగీతకారుడు జుబీన్ గార్గ్
- తన జీవితమంతా కృషి చేశారని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వ్యాఖ్య

ఢిల్లీ : అసోంను ఏకం చేయటానికి సంగీతకారుడు జుబీన్ గార్గ్ తన జీవితమంతా కృషి చేశారని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. ఆయన ఎప్పుడు కూడా ఎవరితో దురుసుగా ప్రవర్తించలేదన్నారు.



కాంగ్రెస్ సిద్ధాంతం కూడా ద్వేషానికి వ్యతిరేకంగా ప్రేమను పంచటమే అని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున బిశ్వనాథ్ జిల్లాలో ప్రచారం చేసిన రాహుల్, బీజేపీ, అసోం సీఎం హిమంత బిశ్వశర్మపై విమర్శలు చేశారు. దేశంలో అత్యంత అవినీతిపరుడైన సీఎం హిమంత బిశ్వశర్మపై తమ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత చర్యలు తీసుకుంటుందని రాహుల్ హామీ ఇచ్చారు. అసోం సీఎం హిమంత బిశ్వశర్మ క్షమాపణలు కోరినా, ఆయన్ను వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. "అసోంకు చెందిన దివంగత గాయకుడు జుబిన్ గర్గ్ రాష్ట్ర ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు తన జీవితాంతం కృషి చేశారు. ఆయన ఎవరితోనూ దురుసుగా ప్రవర్తించలేదు. మిగతా..2లో

### ఎన్నికల తర్వాత బంగాల్ నుంచి

## భయం పారిపోతుంది




- బంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయం
- బీజేపీ మహావిజయంతో ప్రజల్లో భరోసా పెరుగుతుంది: ప్రధాని మోదీ

ఢిల్లీ : బంగాల్‌లో ఈసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తంచేశారు.

### 'ప్రతీకారం తీర్చుకోవడానికి

# ఓటు వేయండి

- ప్రజలకు మమతా బెనర్జీ పిలుపు ఎస్ ఐఆర్ లో పేర్లు తొలగించడంపై మమతా ఆగ్రహం
- ఎస్ ఐఅర్ కు వ్యతిరేకంగా ఓటు వేయాలని ప్రజలకు పిలుపు

అమరావతి :అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ ఐఆర్ )పై బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి తీవ్ర విమర్శలు



గుప్పించారు. ఎస్ ఐఆర్ ప్రక్రియలో అనేక మంది పేర్లు తొలగించారని ఆరోపించారు. అయితే, ప్రజల పేర్లను తొలగించినందుకు ప్రతీకారం తీర్చుకోవడానికి, అలాగే ఎస్ ఐఅర్ కు వ్యతిరేకంగా ఓటు వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల ఫలితాల్లోనే మీ ప్రతిస్పందన కనిపించాలన్నారు. అలాగే ఎస్ ఐఆర్ లో పేర్లు గల్లంతైన వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని మమతా సూచించారు. మిగతా..2లో

### హైదరాబాద్‌లో భారీ బస్ టెర్మినల్..

### 100 ఎకరాల్లో టీజీఎస్ఆర్టీసీ ప్రణాళిక




- జీడిమెట్ల సమీపంలోని గాజులరామారంలో 100 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా యంత్రాంగం ఇటీవలే టీజీఎస్ఆర్టీసీకి 100 ఎకరాల భూమిని కేటాయించింది.

హైదరాబాద్ నగర వ్యవస్థను ఆధునీకీకరించే దిశగా టీజీఎస్ఆర్టీసీ కీలక అడుగు వేస్తోంది. జీడిమెట్ల సమీపంలోని గాజులరామారంలో 100 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నగరంలోకి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే బస్సుల వల్ల తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు

### ఆ ఐదు తీర్మానాలు

# పరిష్కరించాల్సిందే

- సింగరేణి సంస్థ గురించి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏ మాత్రం అవగాహన లేకపోవటం సిగ్గుచేటని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు.
- కార్మికుల మీద ప్రేమతో సంస్థను కాపాడుకుంటూ ముందుకు తీసుకెళ్లాలన్న సోయి ప్రభుత్వానికి లేదన్నారు.
- పార్టీలు ఏవైనా సరే అందులో ఉండే ట్రేడ్ యూనియన్లు మాత్రం కార్మికుల కోసమే మాట్లాడాలని కవిత హితవుపలికారు.



హైదరాబాద్: సింగరేణి సంస్థ గురించి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏ మాత్రం అవగాహన లేకపోవటం సిగ్గుచేటని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కార్మికుల మీద ప్రేమతో సంస్థను కాపాడుకుంటూ ముందుకు తీసుకెళ్లాలన్న సోయి ప్రభుత్వానికి లేదన్నారు. పార్టీలు ఏవైనా సరే అందులో ఉండే ట్రేడ్ యూనియన్లు మాత్రం కార్మికుల కోసమే మాట్లాడాలని కవిత హితవుపలికారు. జెండాలన్నీ పక్కన పెట్టి కార్మికుడికి మంచి చేయటమే అజెండా కావాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో సేవ్ సింగరేణి రౌండ్ టేబుల్ సమావేశం ముగింపు సందర్భంగా కవిత మాట్లాడారు. మిగతా..2లో

### ఏపీలోని 5 గ్రామాలను తెలంగాణలో కలపండి...

## అమిత్ షాకు మంత్రి తుమ్మల లేఖ

- ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్-తెలంగాణ సరిహద్దుల్లో ఉన్న ఈ ఐదు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రి తుమ్మల వివరించారు.
- తెలంగాణలో విలీనం చేయాలని కోరుతూ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు.

భద్రాచలం సమీపంలోని ఐదు గ్రామాలను తెలంగాణలో విలీనం చేయాలని కోరుతూ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర



హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. పాలనా సౌలభ్యం, స్థానిక గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం ఈ విలీనం అత్యవసరమని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్-తెలంగాణ సరిహద్దుల్లో ఉన్న ఈ ఐదు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రి తుమ్మల వివరించారు. ఈ గ్రామాలను భద్రాచలంలో విలీనం చేయడం ద్వారా గిరిజనుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఈ అంశంపై ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే విలీనానికి సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించేలా చర్యలు తీసుకోవాలని ఆయన అమిత్ షాను కోరారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపి, సానుకూలంగా స్పందించాలని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

## జగన్‌పై మంత్రుల ఫైర్.. తుగ్లక్‌తో పోలుస్తూ తీవ్ర విమర్శలు





"తుగ్లక్ పేరు వినడమే తప్ప చూడలేదు. కానీ, జగన్‌ను చూస్తే ఆయనే గుర్తొస్తున్నారు.

చంద్రబాబుపై నమ్మకంతోనే రైతులు రాజధానికి భూములు ఇచ్చారని, అలాంటి రైతులను అవమానించిన వైసీపీకి భవిష్యత్తులో పుట్టగతులుండవని హెచ్చరించారు.

ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జగన్‌ను చూస్తే తుగ్లక్ పాలన గుర్తొస్తోందని పార్థసారథి వ్యంగ్యాస్త్రాలు సంధించగా, విశ్వసనీయత గురించి మాట్లాడే నైతిక హక్కు ఆయనకు లేదని అచ్చెన్నాయుడు అన్నారు. మంగళగిరిలో మంత్రి పార్థసారథి మీడియాతో మాట్లాడుతూ.. "తుగ్లక్ పేరు వినడమే తప్ప చూడలేదు. కానీ, జగన్‌ను చూస్తే ఆయనే గుర్తొస్తున్నారు. మూడు రాజధానుల పేరుతో ఆయన మూడు ముక్కలాట ఆడారు. తాను చెప్పిందే అందరూ వినాలనే ధోరణి వల్లే ప్రజలు ఎన్నికల్లో తగిన తీర్పు ఇచ్చారు" అని మండిపడ్డారు. మిగతా..2లో

## కొమురం భీం జిల్లాలో వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి.. మరో ఏడుగురి పరిస్థితి విషమం



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి.

కొమురం భీం జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది.

బతుకుదెరువు కోసం ఉపాధి హామీ పనులకు వెళ్లిన ఒక నిరుపేద కూలీ వడదెబ్బకు బలయ్యాడు.

లింగాపూర్, ఏప్రిల్ 5: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. కొమురం భీం జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. బతుకుదెరువు కోసం ఉపాధి హామీ పనులకు వెళ్లిన ఒక నిరుపేద కూలీ వడదెబ్బకు బలయ్యాడు. ఈ ఘటన లింగాపూర్ మండలంలోని గోండ్ గూడ గ్రామంలో జరిగింది. ఈ ఏడాది నమోదవుతున్న రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు సామాన్యుల ప్రాణాలు హరిస్తున్నాయి. గోండ్ గూడ గ్రామానికి చెందిన ఆత్రం అక్బర్షావ్ (32) అనే యువకుడు మిగతా..2లో

### ఏపీ తీర ప్రాంతంలో చేపల అక్రమ వేట..

### తమిళనాడు బోట్లపై ఏపీ ప్రభుత్వం ఆగ్రహం..




- ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంలో తమిళనాడు బోట్లు తిరగడంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సీరియస్ అయినట్లు గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.
- ఏపీ తీర ప్రాంతంలోని బంగాళాఖాతంలోకి ఆ రాష్ట్ర బోట్లు అక్రమంగా చొరబడి చేపల వేట చేస్తున్నాయని ఆయన ఆరోపించారు.

## నీటి సంరక్షణపై 100 రోజుల యాక్షన్ ప్లాన్

## ప్రకటించిన సీఎం చంద్రబాబు..

- నీటి సంరక్షణ- జలవనరుల పరిరక్షణ అంశాలే అజెండాగా 100 రోజుల కార్యాచరణను ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు.
- ఏప్రిల్ 6 నుంచి జులై 14వ తేదీ వరకు నీటి సంరక్షణకు యాక్షన్ ప్లాన్‌ను ప్రకటించారు.
- ఏపీ ప్రభుత్వం 'నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత' పేరుతో నీటి సంరక్షణ కార్యక్రమాన్ని చేపడుతోంది.



అమరావతి: నీటి సంరక్షణ- జలవనరుల పరిరక్షణ అంశాలే అజెండాగా 100 రోజుల కార్యాచరణను ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఏప్రిల్ 6 నుంచి జులై 14వ తేదీ వరకు నీటి సంరక్షణకు యాక్షన్ ప్లాన్‌ను ప్రకటించారు. ఏపీ ప్రభుత్వం 'నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత' పేరుతో నీటి సంరక్షణ కార్యక్రమాన్ని చేపడుతోంది. ఈ మేరకు సాగునీటి సంఘాలు కేంద్రీకృతంగా యాక్షన్ ప్లాన్ అమలు చేసేలా ప్రణాళికలు రచించారు. ఈ సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు ఇవాళ(ఆదివారం) రాష్ట్రంలోని సాగునీటి సంఘాల సభ్యులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. 60 వేల మంది సాగునీటి సంఘాల సభ్యులకు మిగతా..2లో

### ద్వారకాతిరుమలలో

# సిబ్బంది చేతివాటం

మూడు కత్తెర్ల మాటున దాగువున్న "బ్లేడుల" వ్యవహారం!

- ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల ఆలయ సిబ్బంది మరోసారి చేతివాటం
- మూడు కత్తెర్ల టిక్కెట్లు స్థానంలో పూర్తి క్షవరం టికెట్లు
- బ్లేడ్లను పక్కదారిలో అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నా సిబ్బంది



అమరావతి : ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయానికి నిత్యం వేలాది మంది భక్తులు తరలి వస్తుంటారు. ఇక్కడకు వచ్చే భక్తులు కేశఖండనశాలలో స్వామివారికి తలనీలాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకుంటారు. పెద్ద తిరుపతి వెళ్లలేని భక్తులు సైతం ఇక్కడే మొక్కులు చెల్లించుకుంటారు. ఇందులో కొందరు మూడు కత్తెర్లు ఇస్తే, ఇంకొందరు పూర్తి క్షవరం ఇస్తుంటారు. దీన్నే అదునుగా సిబ్బంది తీసుకుంది. అసలేం జరిగిందంటే? ఏలూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల ఆలయ సిబ్బందికి చేతివాటం ప్రదర్శించడం వెన్నతో పెట్టిన విద్య. దీంతో భక్తులకు క్షవరాలు చేసేందుకు మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

## ఎన్నికల తర్వాత బంగాల్ నుంచి భయం పారిపోతుంది

ఈ ఎన్నికల తర్వాత బంగాల్ నుంచి భయం పారిపోతుందన్నారు. కూచ్ బెహార్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న ప్రధాని మోదీ, టీఎంసీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల తర్వాత టీఎంసీ పాపాల లెక్కతేల్చటమే కాకుండా బాధ్యులైన వారికి శిక్ష తప్పదని ప్రధాని మోదీ హెచ్చరించారు. "పోలింగ్ రోజు టీఎంసీ గూండాలు మిమ్మల్ని ఎంత(ప్రజలను) బెదిరించినా కూడా చట్టంపై నమ్మకం ఉంచాలి. ఈ ఎన్నికల్లో బంగాల్ నుంచి భయం పారిపోతుంది. బీజేపీ మహావిజయంతో భరోసా పెరుగుతుంది. ఈసారి ఎన్నికల తర్వాత వారి (టీఎంసీ)పాపాల లెక్క పూర్తిగా తేలుస్తాం. వెతికి వెతికి మరీ లెక్కిస్తాం. మే 4వ తేదీ తర్వాత చట్టం తనపని తాను చేస్తుంది. ఎంత పెద్ద గూండా అయినా సరే ఈసారి శిక్ష తప్పదు."

## ద్వారకాతిరుమలలో సిబ్బంది చేతివాటం
## మూడు కత్తెర్ల మాటున దాగువున్న "బ్లేడుల" వ్యవహారం!

ఉపయోగించే బ్లేడ్లను సైతం వదలడం లేదు. మూడు కత్తెర్ల టిక్కెట్లు స్థానంలో పూర్తి క్షవరం టికెట్లు ఇస్తున్నారు. బ్లేడ్లను మిగిల్చుకుంటున్నారు. మూడు కత్తెర్లు టికెట్లు అడిగితే పూర్తి క్షవరం టికెట్లు ఇస్తుండటంతో భక్తులు విస్తుపోతున్నారు. ఇదేంటని సిబ్బందిని ప్రశ్నిస్తే ఏ టికెట్టు అయినా ఫర్వాలేదని చెబుతున్నారు. మీరు అనుకున్న విధంగానే మొక్కు చెల్లించుకోవచ్చని సిబ్బంది అంటున్నారని భక్తులు వాపోతున్నారు. మతలబు జరుగుతుంది ఇలా : పూర్తి క్షవరం టికెట్ ధర రూ.25, అలాగే మూడు కత్తెర్ల టికెట్ ధర రూ.25. రెండు టికెట్ల ధరలు కూడా ఒకేలా ఉంటాయి. ఏ టికెట్టు ధర ఎంత అనేది వివరంగా ఉంటుంది. అయితే పూర్తి క్షవరం టికెట్టుపై భక్తులకు బ్లేడు ఇస్తారు. మూడు కత్తెర్ల టికెట్

## జగన్‌పై మంత్రుల ఫైర్.. తుగ్లక్‌తో పోలుస్తూ తీవ్ర విమర్శలు

చంద్రబాబుపై నమ్మకంతోనే రైతులు రాజధానికి భూములు ఇచ్చారని, అలాంటి రైతులను అవమానించిన వైసీపీకి భవిష్యత్తులో పుట్టగతులుండవని హెచ్చరించారు.

### అమరావతిపై జగన్‌కు ఎందుకంత కక్ష?: మంత్రి అచ్చెన్నాయుడు

మరోవైపు శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. "తెలుగు జాతిపైనా, అమరావతిపైనా జగన్‌కు ఎందుకంత కక్ష? మొదట అమరావతిని రాజధానిగా అంగీకరించి, అధికారంలోకి రాగానే మూడు రాజధానులంటూ ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టారు" అని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆగిపోయిన రాజధాని నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించామని ఆయన అన్నారు. జగన్‌కు విశ్వసనీయత గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు .

## ఆ ఐదు తీర్మానాలు పరిష్కరించాల్సిందే

ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ..'సింగరేణిపై రేవంత్ సర్కార్‌కు అవగాహన లేదు. నైనీ బ్లాక్‌కు సంబంధించి మన కార్మికులు చేసిన ఆందోళనతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఆ బాధ, ఆక్రోశంతోనే సింగరేణిలో 13 వేల మంది కార్మికులు ఎక్కువగా ఉన్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. ప్రధాని మోదీ లేబర్ కోడ్ పేరుతో నాలుగు నల్ల చట్టాలు తెస్తే.. ఆ చట్టాలను తమ రాష్ట్రంలో అమలు చేసేది లేదని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తేల్చి చెప్పారు. అలాంటి నిర్ణయం తీసుకున్న ఆమెకు మనం సెల్యూట్ చేయాల్సిందే. కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర ప్రభుత్వాలు కూడా లేబర్ కోడ్ చట్టాలను అమలు చేయటం లేదు. కానీ మన రాష్ట్రం మాత్రం ఈ చట్టాలను అమలు చేయమని చెప్పే విషయంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారు. ఇవాళ్టి రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రధానంగా ఐదు తీర్మానాలు చేసుకున్నాం. ఈ సమావేశంలో చర్చించి చేసిన తీర్మానాలను లేఖ రూపంలో ప్రభుత్వానికి సమర్పిస్తాం. తెలంగాణకు సింగరేణి ప్రాణపదం. కచ్చితంగా సంస్థను కాపాడుకుంటాం. 70 ఏళ్ల వయసులో మా హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్‌పై రౌడీ షీట్ పెట్టారు. ఆయన పెద్ద రౌడీ అని ప్రభుత్వం అనుకుంటే మేము చిన్న రౌడీలం. మాతోపాటు ధర్మసమాజ్ పార్టీ, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కూడా జత చేరాయి. మా రౌడీల గుంపును తట్టుకోవటం ప్రభుత్వం వల్ల కాదు. ఈ కార్యక్రమాన్ని ఏదో రాజకీయ కార్యక్రమం లాగా కాదు.. సింగరేణి సంస్థను కాపాడుకోవాలనే ఉద్దేశంతో పెట్టాం. మరో 20 రోజుల్లో కొత్త రాజకీయ శక్తిగా వస్తున్నాం. మేము తీర్మానం చేసిన అంశాలకు ప్రభుత్వం వెంటనే పరిష్కారం చూపాలి. లేదంటే రాజకీయ పార్టీగా ఏర్పడిన తర్వాత బొగ్గు బాయి బాట పడుతాం. అదే విధంగా సమ్మెకు కూడా వెనుకాడబోం. మాతో, సింగరేణితో పెట్టుకోవద్దు. రాజకీయ పార్టీగా వచ్చిన తర్వాత ప్రజలకు మంచి చేసే కొత్త తరహా రాజకీయాలు ఎలా ఉంటాయో చూపించబోతున్నాం' అని కవిత చెప్పుకొచ్చారు.

## హైదరాబాద్‌లో భారీ బస్ టెర్మినల్..
## 100 ఎకరాల్లో టీజీఎస్ఆర్టీసీ ప్రణాళిక

ఈ టెర్మినల్‌ను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా యంత్రాంగం ఇటీవలే టీజీఎస్ఆర్టీసీకి 100 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ స్థలంలో అంతర్రాష్ట్ర, సిటీ బస్సుల కోసం వేర్వేరు టెర్మినల్స్ నిర్మించనున్నారు. ఇందులో భాగంగా సుమారు 30 ఎకరాలను అంతర్రాష్ట్ర బస్సు సర్వీసుల కోసం, మరో 20 ఎకరాల్లో ఆధునిక సౌకర్యాలు, షాపులతో కూడిన సిటీ బస్ టెర్మినల్ నిర్మించాలని అధికారులు భావిస్తున్నారు. ఇక్కడి నుంచే నగరంలోని అన్ని ప్రాంతాలకు బస్సులు నడపనున్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 10 ఎకరాల్లో ఎలక్ట్రిక్ బస్సు డిపో, 15 ఎకరాల విస్తీర్ణంలో ఈవీ బస్సుల కోసం ప్రత్యేక చార్జింగ్ స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఈ బృహత్ ప్రణాళిక పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చితే హైదరాబాద్ శివారు ప్రాంతం నుంచి నగర రవాణా వ్యవస్థ మరింత పటిష్టం కానుంది.

## కొమురం భీం జిల్లాలో వడదెబ్బతో
## ఉపాధి కూలీ మృతి.. మరో ఏడుగురి పరిస్థితి విషమం

రెండు రోజుల క్రితం ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులకు వెళ్లాడు. పనిలో ఉన్న సమయంలో తీవ్రమైన ఎండ ప్రభావానికి గురై, ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. ప్రాథమిక చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోవడంతో మృతి చెందాడు. కుటుంబ భారమంతా మోయాల్సిన యజమాని ఇలా అకాల మరణం చెందడంతో ఆ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.మరోవైపు అదే గ్రామానికి చెందిన మరో ఏడుగురు కూలీలు కూడా వడదెబ్బ బారిన పడ్డారు. పని ముగించుకుని ఇంటికి చేరిన తర్వాత వారికి వాంతులు, తలతిరగటం వంటి లక్షణాలు కనిపించాయి. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు వెంటనే జైనూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. ఎండలో వెళ్లేవారు తలపాగా ధరించాలని, ఎప్పటికప్పుడు నీరు తాగుతూ అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

## ఏపీ తీర ప్రాంతంలో చేపల అక్రమ వేట..
## తమిళనాడు బోట్లపై ఏపీ ప్రభుత్వం ఆగ్రహం..




నెల్లూరు: ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంలో తమిళనాడు బోట్లు తిరగడంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సీరియస్ అయినట్లు గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఏపీ తీర ప్రాంతంలోని బంగాళాఖాతంలోకి ఆ రాష్ట్ర బోట్లు అక్రమంగా చొరబడి చేపల వేట చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ మేరకు తమిళనాడు బోట్లను ఎదుర్కొనేందుకు టాస్క్ ఫోర్స్‌ను రంగంలోకి దింపినట్లు మంత్రి వెల్లడించారు. మన రాష్ట్ర మత్స్య సంపదను తమిళనాడు మత్స్యకారులు కొల్లగొడుతున్నారని.. అందుకే ఆధునిక స్పీడ్ బోట్ల సహాయంతో టాస్క్ ఫోర్స్ గస్తీ కాస్తోందని పేర్కొన్నారు. మెరైన్ బోట్ల ద్వారా చేపల అక్రమ వేటకు అడ్డుకట్ట వేసేందుకు సీఎం చంద్రబాబు సర్కార్ చిత్తశుద్ధితో చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి కొల్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రత్యేక నిధులు తెచ్చి మరీ ఏపీ మత్స్యకారులకు సబ్సిడీ ద్వారా ఉపకరణాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌పై ప్రతిపక్షం లేనిపోని ఆరోపణలు చేస్తూ అనుమానాలు సృష్టిస్తోందని మంత్రి కొల్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. జువ్వలదిన్నె హార్బర్ వద్ద సాగర్ డిఫెన్స్‌కి 7.5 ఎకరాలు మాత్రమే ఏపీ ప్రభుత్వం ఇస్తోందని తెలిపారు. పులికాట్‌లో పూడిక తొలగించేందుకు చర్యలు చేపట్టామని ఆయన చెప్పారు. కృష్ణపట్నం పోర్ట్ వద్ద జెట్టీల ఏర్పాటుకూ చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. ఏపీ తీరంలో తమిళనాడు, పాండిచ్చేరి బోట్ల ఆగడాలు, అక్రమ చేపల వేటని అస్సలు ఊపేక్షించవద్దని సీఎం చంద్రబాబు ఆదేశాలిచ్చారని మెరైన్ ఐజీ గోపీనాథ్ తెలిపారు. దీంతో తీరంలో 24గంటలూ గస్తీ ముమ్మరం చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే 4 బోట్లలో టాస్క్ ఫోర్స్ బృందాలు ముమ్మర గస్తీ కాస్తున్నట్లు ఆయన తెలిపారు. మరో 4 బోట్లు త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు ఐజీ వెల్లడించారు. ఇటీవల కాలంలో మూడు ఇతర రాష్ట్రాల బోట్లని టాస్క్ ఫోర్స్ బృందాలు పట్టుకున్నట్లు తెలిపారు. జువ్వలదిన్నె హార్బర్‌లో మెరైన్ ఐజీ గోపీనాథ్, డీఎస్పీలు ఘట్టమనేని శ్రీనివాసరావు, గొట్టిపాటి చెంచుబాబు, శ్రీధర్, శ్రీనివాసులు, బాలిరెడ్డి పర్యటించారు. సముద్రంలో సుమారు 30 నాటికల్ మైళ్లు బోటులో వెళ్లి పరిశీలించారు.

# 'ప్రతీకారం తీర్చుకోవడానికి ఓటు వేయండి'

మొదటి పేజి తరువాయి

ముర్షిదాబాద్ లోని సంషేర్‌గంజ్ జరిగిన ఎన్నికల సభలో మమతా బెనర్జీ ఈ మేరకు వ్యాఖ్యానించారు. ఓటర్ల జాబితా తొలగింపునకు కేంద్ర ప్రభుత్వాన్ని పరోక్షంగా బాధ్యులుగా చూపిస్తూ మమత విమర్శించారు. ధైర్యం ఉంటే నేరుగా పోటీ చేయాలని వ్యాఖ్యానించారు. అలాగే, కొందరు బూత్ ఏజెంట్లు ప్రలోభాలకు లోనుకాకుండా పార్టీ ప్రయోజనాలను కాపాడాలని కోరారు. కొన్నిచోట్ల ఈవీఎం యంత్రాల పనితీరుపై కూడా ఆమె అనుమానాలు వ్యక్తం చేశారు. కొన్ని ప్రాంతాల్లో యంత్రాలు పనిచేయకుండా చేసే ప్రయత్నాలు జరుగుతాయని ఆరోపించారు. అలాంటి సందర్భాల్లో మరమ్మతులు చేయకుండా కొత్త యంత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేయాలని కార్యకర్తలను ఆదేశించారు.

### 'వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిలిచా'

ముస్లింల ప్రయోజనాల కోసం తాను పోరాడుతున్నానని, వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిలిచినట్లు మమతా బెనర్జీ స్పష్టం చేశారు. కానీ ఈ విషయంలో బీజేపీ తనపై తప్పుడు ప్రచారాలు చేస్తోందని ఆరోపించారు. అయితే, వక్ఫ్ చట్ట అమలుతో ముర్షిదాబాద్ జిల్లాలో జరిగిన హింసాత్మక ఘటనలను ప్రస్తావించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రాణనష్టాలు జరిగినట్లు గుర్తుచేశారు. అయితే, ఆ హింసాత్మక ఆందోళనలకు టీఎంసీ ప్రేరేపిస్తోందని బీజేపీ



ఆరోపించింది. ఈ ఆరోపణలను సైతం మమతా ఖండించారు.

### టీఎంసీ పాలనలో ఉద్యోగ అవకాశాలు పెరిగాయి!

ఇదిలా ఉండగా, టీఎంసీ పాలనలో మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన యువతకు విద్యా అవకాశాలు పెరిగాయని మమతా పేర్కొన్నారు. వారు ఉన్నత ఉద్యోగాలు సాధిస్తున్నారని చెప్పారు. అయితే, సమాజం పురోగమిస్తోందని, కానీ ప్రత్యర్థి పార్టీలు దాన్ని సహించలేకపోతున్నాయని మమతా తెలిపారు. టీఎంసీ వరుసగా నాలుగోసారి పదవిలోకి వస్తే, మహిళల కోసం అమలు చేస్తున్న లక్ష్మీర్ భండార్ పథకాన్ని కొనసాగిస్తామని, జీవితకాల ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, నిరుద్యోగ యువత కోసం ప్రారంభించిన బంగ్లార్ యువ సాథి పథకం కింద నెలకు రూ.1500 చొప్పున సహాయం అందిస్తామని తెలిపారు.

### అలాగైతే ముందు వాళ్లే రాజీనామా చేయాలి!

అసెంబ్లీ ఎన్నికల కారణంగా అభివృద్ధి పనులు నిలిచిపోయాయని మమత పేర్కొన్నారు. ఎన్నికల సంఘం దాదాపు 500 మంది అధికారులను బదిలీ చేసిందని, ఎన్నికల తర్వాత పనులు మళ్లీ ప్రారంభమవుతాయని చెప్పారు. అలాగే, ఎన్నికల సంఘం చర్యలపై కూడా ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్ ఐఆర్ పేరుతో కొంత మంది ఓటర్లను బెదిరిస్తున్నారని, మరికొందరిని తొలగిస్తున్నారని ఆరోపించారు. ఓటర్ల జాబితాలో చొరబాటుదారుల పేర్లు ఉంటే, గతంలో ప్రధానమంత్రి, హోంమంత్రి కూడా వారి ఓట్లతోనే గెలిచారని మమతా అన్నారు. కాబట్టి వారే ముందుగా రాజీనామా చేయాలని వ్యాఖ్యానించారు. అదేవిధంగా, 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఉపయోగించిన జాబితానే ఈసారి ఎందుకు ఉపయోగించలేదని మమతా ప్రశ్నించారు.

### బంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమరం

కాగా, బంగాల్ లో 294 అసెంబ్లీ స్థానాలకు గానూ ఏప్రిల్ 23, 29 రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. అలాగే మే 4న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో అన్ని పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నాయి. గెలుపే లక్ష్యంగా అధికార, విపక్ష పార్టీలు పావులు కదుపుతు ముందుకు సాగుతున్నాయి.

# నీటి సంరక్షణపై 100 రోజుల యాక్షన్ ప్లాన్ ప్రకటించిన సీఎం చంద్రబాబు..

మొదటి పేజి తరువాయి

కీలక బాధ్యతలు అప్పగించారు. ఇరిగేషన్, అటవీ, పంచాయతీ రాజ్, వ్యవసాయ, పశు సంవర్ధక శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..'నీటిభద్రత- సాగునీటి సంఘాల బాధ్యత పేరుతో 100 రోజుల కార్యాచరణ రేపటి నుంచి జులై వరకు సాగుతుంది. నీటి భద్రత అనేది ప్రభుత్వ బాధ్యతే కాదు.. ప్రజల భాగస్వామ్యం కూడా ఉండాలి. దీనికి సాగునీటి సంఘాలు బాధ్యత తీసుకోవాలి. ప్రతి చుక్కనూ ఒడిసి పట్టుకోవాలి.. ప్రతి బొట్టును సంరక్షించుకోవాలి. భూగర్భ జలాలను పెంచాలి. ఏప్రిల్ 6 నుంచి ఏప్రిల్ 15 తేదీ వరకు పనుల గుర్తింపు కార్యక్రమం చేపట్టాలి. ఏప్రిల్ 16 నుంచి 20వ తేదీ వరకు గుర్తించిన పనులకు పరిపాలనా అనుమతులు ఇవ్వాలి. ఏప్రిల్ 21 నుంచి జులై 9వ తేదీ వరకు పనులను చేపట్టాలి. జులై 10 నుంచి 14 జులై మధ్య పూర్తి చేసిన పనులకు సంబంధించిన నివేదికలను సమర్పించాలి. 100 రోజుల్లో ఈ పనులు చేపట్టాలి. ఆ తర్వాత వర్షాలు పడతాయి. భూగర్భ జలాలనూ సంరక్షించుకోవాలి. నీటి భద్రత చేపట్టాలి. రిజర్వాయర్లలో నిండుగా నీళ్లున్నాయి. గతానికంటే భూగర్భ జలాలు పెరిగాయి. నీటి భద్రత ఇవ్వగలిగితే.. మిగిలిన రంగాల్లో అభివృద్ధి దానంతటికి అదే జరుగుతుంది. తాగు, సాగు, పారిశ్రామిక అవసరాలకు నీళ్లు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. వేసవికి ముందు 6 మీటర్లు, వర్ష కాలం తర్వాత 3 మీటర్ల లోతున భూగర్భ జలాలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలి. నీటిని నిల్వ చేయాలి.. పొదుపు చేయాలి. మైక్రో ఇరిగేషన్ అమలు చేయాలి.. ప్రతి చుక్కనూ సమర్థవంతంగా వినియోగించుకోవాలి. ప్రస్తుతం రాష్ట్రంలో 8.7 మీటర్ల లోతున భూగర్భ జలాలు ఉన్నాయి. కనీసం 1.5 మీటర్ల మేర గ్రౌండ్ వాటర్ పెంచాలి. జలధార అని పేరు పెట్టి నీటి భద్రత, సంరక్షణ చర్యలను అన్నమయ్య జిల్లా అద్భుతంగా చేపట్టింది. భూగర్భ జలాలను పెద్దఎత్తున పెంచారు. స్థానికంగా ఉన్న జలవనరులను వినియోగించుకున్నారు. అన్ని చెరువులను నింపారు.. భూగర్భ జలాలను పెంచారు. అన్నమయ్య జిల్లా స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలి. ఫీడర్ ఛానెళ్లను క్లియర్ చేయాలి. పూడిక తీత పనులు చేపట్టాలి. గుర్రపు డెక్క తొలగించాలి. చెరువులు, కాల్వలను క్లియర్ చేయాలి. అప్పుడే ఎక్కువ నీటిని సంరక్షించుకోవచ్చు, ముంపును అరికట్టవచ్చు. అవసరమైన మేరకు చెక్ డ్యాంలను రిపేర్లు చేయాలి. కొత్త స్ట్రక్చర్ల నిర్మాణం చేపట్టాలి. భూగర్భజలాలు మరీ తక్కువగా ఉన్న చోట ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. సాగునీటి సంఘాలు వాటర్ బడ్జెట్ తయారు చేసుకోవాలి. ఆయా సాగునీటి సంఘాల పరిధిలో నీటి లభ్యత ఏ మేరకు ఉందో అంచనా వేసుకోవాలి. ఎంత డిమాండ్ ఉందో లెక్కలు వేసుకోవాలి. మైక్రో ఇరిగేషన్ పెంచాలి.. వృథాగా నీరు పోకుండా చూడాలి. 100 రోజుల్లో మిషన్ అప్రోచ్‌తో పని చేయాలి. మన భవిష్యత్ మన చేతుల్లోనే ఉంది. కొద్దిపాటి శ్రద్ధ పెడితే నీటి సమస్య లేకుండా చేయవచ్చు. కరవు రహిత రాష్ట్రంగా మార్చవచ్చు. ఒకప్పుడు రాయలసీమ ఎడారి అవుతుందన్నారు. ఇప్పుడు హార్టీకల్చర్ హబ్‌గా మారింది. పెండింగ్ ప్రాజెక్టులను ప్రాధాన్యతల వారీగా చేపడుతున్నాం. హంద్రీ-నీవా, గాలేరు-నగరి, తెలుగు గంగా వంటి ప్రాజెక్టులను ఎన్టీఆర్ హయాంలో చేపట్టాం. ఇప్పుడు పోలవరం



సహా వివిధ ప్రాజెక్టులను పూర్తి చేస్తూ నదీ జలాలను సద్వినియోగం చేసుకుంటున్నాం. ప్రతి ఎకరాకు నీళ్లు ఇవ్వాలనే సంకల్పంతో పని చేస్తున్నాం. సాగునీటి సంఘాలు కూడా అదే తరహాలో నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలి. వర్షపునీరు సంరక్షించుకోగలిగితే మంచి ఫలితాలు వస్తాయి. 2024 మే నుంచి 2025 మే వరకూ 2.20 మీటర్ల మేర భూగర్భ జలాలు పెరిగాయి.. అంటే 200 టీఎంసీల నీటిని పెంచుకోగలిగాం. ప్రజాచైతన్యం.. ప్రజల భాగస్వామ్యంతో 100 రోజుల ఉద్యమాన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలి' అని చంద్రబాబు సూచించారు. కాగా, నీటి భద్రత- సాగునీటి సంఘాల బాధ్యతపై సోమవారం నాడు తాడిపత్రి నియోజకవర్గం యాడికిలో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరై నీటి సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేయనున్నారు.

# కాంగ్రెస్ కు 'బబ్బర్ షేర్' ప్రచారం- మా ప్రత్యర్థులకు నిద్రపట్టడం లేదు

మొదటి పేజి తరువాయి

మా పార్టీ భావజాలం కూడా అలాంటిదే. ద్వేషానికి వ్యతిరేకంగా ప్రేమను పంచడమే మా కాంగ్రెస్ సిద్ధాంతం. మేం అధికారంలోకి వస్తే వందరోజుల్లో జుబీన్ గార్గ్ కేసులో విచారణ జరిపి బాధ్యులకు శిక్షపడేలా చూస్తాం. 6 గిరిజన జాతులకు ఎస్టీ హోదా కల్పిస్తాం. తేయాకు కార్మికులకు రోజుకు రూ.450 వేతనం ఇస్తాం. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేసే మొదటిపని నెలవారీ నగదు బదిలీ కింద ప్రతి మహిళ ఖాతాలో డబ్బు జమ చేస్తాం. చిరు వ్యాపారం చేయాలనుకునే మహిళల ఖాతాలో 50వేలు జమచేస్తాం. కాంగ్రెస్ బబ్బర్ షేర్ ప్రచారం చేస్తున్నాడని మా ప్రత్యర్థులకు నిద్రపట్టడం లేదు"

**రాహుల్ గాంధీ, కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు**

హిమంత క్షమాపణలు కోరినా, ఆయనపై చర్యలు తప్పవని స్పష్టం

హిమంత నేతృత్వంలోని బీజేపీ సర్కారు ప్రజల్లో విద్వేషాన్ని వ్యాప్తి చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. హిమంత అవినీతి చిట్టా ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా వద్ద ఉందని అన్నారు. ఇక్కడి



ప్రభుత్వాన్ని దిల్లీ నుంచి నియంత్రిస్తున్నారని, రాష్ట్రాన్ని బీజేపీ ఏటీఎంలా మార్చేశారని విమర్శించారు. మరికొన్ని రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటవుతుందని, అప్పుడు హిమంత క్షమాపణలు కోరినా, ఆయనపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. "మీ ముఖ్యమంత్రి 24 గంటలూ అర్థం లేని మాటలు మాట్లాడుతూనే ఉంటారు. కాంగ్రెస్ నాయకులు అసోంను విభజించడానికి ఎప్పుడూ చూడలేదు. వారు ఎప్పుడూ ద్వేషాన్ని వ్యాప్తి చేయడానికి ప్రయత్నించలేదు. అయితే, మీ ముఖ్యమంత్రి మాత్రం నిరంతరం రాష్ట్రాన్ని విభజించి, ద్వేషాన్ని వ్యాప్తి చేయడానికి ప్రయత్నిస్తున్నారు. హిమంత బిశ్వ శర్మ అసంబద్ధమైన వ్యాఖ్యలు చేస్తున్నారు. ఆయన భారతదేశంలోనే అత్యంత అవినీతిపరుడైన ముఖ్యమంత్రి కాబట్టే ఇలా చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలోని 'సింహాలు' తనను జైలులో పెడతారని ఆయనకు తెలుసు."

**రాహుల్ గాంధీ, కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు**

అసోం ప్రజల ప్రయోజనాల కంటే, కొన్ని కార్పొరేట్ గ్రూపుల లాభం కోసం బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ క్రమంలోనే ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షాతో సహా కేంద్ర నాయకత్వాన్ని కూడా లక్ష్యంగా చేసుకున్నారు. అసోం వనరులను పారిశ్రామికవేత్తలకు అప్పగిస్తున్నారని ఆయన ఆరోపించారు. "దిల్లీలో కూర్చున్న ఆయన వ్యాపార భాగస్వాములు నరేంద్ర మోదీ, అమిత్ షా మిమ్మల్ని వారి వ్యక్తిగత ఏటీఎంలా మార్చేశారు. మీ భూమిని అంబానీ, అదానీ, బాబా రామ్‌దేవ్‌లకు అప్పగించారు. ఆయన ఈ భూమిని ఉచితంగా ఇవ్వరు. బదులుగా ఈ వ్యక్తులు ఆయనకు తమ మద్దతును అందిస్తున్నారు. ట్రంప్ ట్వీట్ పంపినప్పుడల్లా మోదీ వణికిపోతుంటారు." అని రాహుల్ గాంధీ అన్నారు

# రూ. 650 కోట్లకుపైగా విలువైన నగదు, మాదకద్రవ్యాలు, మద్యం సీజ్ : ఈసీ

### అత్యధికంగా బంగాల్‌లో 319 కోట్ల విలువైన నగదు, డ్రగ్స్, మద్యం, బంగారు ఆభరణాలను సీజ్ చేసినట్లు ఈసీ వెల్లడి

త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో రూ.650 కోట్లకుపైగా విలువైన నగదు, మాదకద్రవ్యాలు, మద్యం పట్టుబడినట్లు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) తెలిపింది. ఇందులో రూ.230 కోట్లు విలువైన డ్రగ్స్, రూ.231.01 కోట్లు విలువైన కానుకలు ఉన్నాయని చెప్పింది. రూ.79.3 కోట్లు విలువైన 29.63 లక్షల లీటర్ల మద్యం, రూ.53.2 కోట్ల నగదు, రూ.58 కోట్లు విలువైన బంగారం, వెండి ఆభరణాలను సీజ్ చేశామని పేర్కొంది. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు వీటన్నింటిని తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఆదివారం ఈసీ వెల్లడించింది.

### ఏ రాష్ట్రంలో ఎంత?

బంగాల్‌లో రూ.319 కోట్లు, తమిళనాడులో రూ.170 కోట్లు, అసోంలో రూ.97 కోట్లు, కేరళలో రూ.58 కోట్లు, పుదుచ్చేరిలో రూ.7 కోట్లు విలువైన నగదు, మద్యం, కానుకలు, మాదక ద్రవ్యాలు, బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు ఈసీ చెప్పింది. కోల్‌కతాలోని టోలీగంజ్ ఏరియాలో ఒక ఎస్‌యూవీ వాహనం నుంచి రూ.38 లక్షల నగదును సీజ్ చేశారు. ఒక ప్లైవుడ్ దుకాణం సమీపంలో నిలిపి ఉంచిన వాహనంలో ఈ నగదు లభ్యమైంది. దీన్ని ఆదాయపు పన్ను శాఖ అధికారులకు అప్పగించారు. ఆ డబ్బు కోల్‌కతాలోని అలీపుర్ ఏరియాకు చెందిన ఒక వ్యాపారవేత్తది అని గుర్తించారు. అసోంలో రూ.4 కోట్ల నగదు, రూ.20 కోట్ల మద్యం, రూ.56 కోట్ల డ్రగ్స్, రూ.4 కోట్ల బంగారం, వెండి ఆభరణాలు, రూ.13 కోట్ల ఇతర వస్తువులను సీజ్ చేశారు.

### 5,173కుపైగా ఫ్లయింగ్ స్క్వాడ్‌లు

అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఈ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఫిర్యాదులను 100 నిమిషాల్లో పరిష్కరించేందుకు 5,173కుపైగా ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఈసీ మోహరించింది. సున్నితమైన ప్రదేశాల్లో వాహనాల తనిఖీ, అనుమానాస్పద కార్యకలాపాల పర్యవేక్షణ కోసం 5,200 మందితో నిఘా టీమ్‌లను ఏర్పాటు చేసింది. కేరళ, అసోం, పుదుచ్చేరిలలో ఈనెల 9న, తమిళనాడులో ఈనెల 23న ఓటింగ్ జరగనుంది. బంగాల్‌లో ఈనెల 23, 29 తేదీల్లో రెండు విడతల్లో పోలింగ్ జరగనుంది. అన్ని రాష్ట్రాలు,




కేంద్రపాలిత ప్రాంతానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు జరిగి ఫలితాలు మే 4న వెలువడనున్నాయి.

### రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కఠిన ఆదేశాలు

నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ జరిగేలా చూసేందుకు ఎన్నికల సంఘం విస్తృతమైన ఏర్పాట్లు చేసింది. ఎన్నికలు జరగనున్న 5 రాష్ట్రాలు, వాటి 12 సరిహద్దు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్య కార్యదర్శులు, ముఖ్య ఎన్నికల అధికారులు (సీఈఓలు), పోలీస్ డైరెక్టర్ జనరల్స్ (డీజీపీలు), ఇతర ఉన్నతాధికారులతో ఈసీ పలు సమీక్షా సమావేశాలు నిర్వహించింది. ఎన్నికలు హింసారహితంగా, బెదిరింపులు లేకుండా, ప్రలోభాలు లేకుండా జరిగేలా చూడాలని అమలు సంస్థలకు ఈ సమావేశాలలో స్పష్టమైన సూచనలను జారీ చేసింది. ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించడంలో పౌరులు, రాజకీయ పార్టీలు తమకు సహకారాన్ని అందించాలని ఈసీ పిలుపునిచ్చింది. పారదర్శకత, జవాబుదారీతనాన్ని మరింత బలోపేతం చేసేందుకు జుజ×అవ్ పోర్టల్‌లోని మాడ్యూల్ ద్వారా ఎన్నికల క్రమశిక్షణా నియమావళి ఉల్లంఘనలపై సమాచారాన్ని అందించాలని కోరింది. దర్యాప్తులు, తనిఖీల సమయంలో సాధారణ పౌరులు అనవసరమైన అసౌకర్యానికి, వేధింపులకు గురికాకుండా చూడాలని సంబంధిత దర్యాప్తు ఏజెన్సీలకు ఎన్నికల సంఘం సూచించింది. ఈ దిశగా ప్రజల నుంచి అందే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలో ఫిర్యాదుల పరిష్కార కమిటీలను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేసింది.


# యేసుక్రీస్తు ప్రేమ,శాంతి, సహనానికి ప్రతీక.

**ఆయన బోధనలు మానవాళికి మార్గదర్శక.**

**శాంతి ర్యాలీ ఘనంగా నిర్వహించారు.**

**ఎం.బి కార్మల్ సంఘం**

**కాపరి ఎంఎస్ హ్యాపీ పాల్.**



అమరచింత ఏప్రిల్ 5 (వార్త నిర్భయం)

ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఎం.బి కార్మల్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పురవీధుల్లో శాంతి ర్యాలీ ఘనంగా నిర్వహించారు అనంతరం కల్వరి కొండ దగ్గర ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.పునరుత్థానం చేసిన మహోన్నత రోజు ఈస్టర్ అని, క్రైస్తవులు పునరుత్థాన శక్తితో ఆధ్యాత్మికంగా పునీతులు కావాలని క్రైస్తవ మత పెద్దలు ఉద్బోధించారు.



అమరచింత మున్సిపాలిటీ ఎం బి కార్మల్ సంఘం చర్చిలలో ఆదివారం ఈస్టర్ వేడుకను ఘనంగా నిర్వహించారు. చర్చిలలో మత పెద్దలు ప్రత్యేక ఈస్టర్ ప్రార్థనలు, ఆరాధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ కాపరి ఎంఎస్ హ్యాపీ పాల్ మాట్లాడుతూ క్రీస్తు సందేశాన్ని భక్తులకు అందించారు. శుభ శుక్రవారం రోజున శిలువ శ్రమను, శిలువ మరణమును అనుభవించి, మూడవ దినము ఆదివారంన పునరుత్థానము అయ్యారని చెప్పారు. ఆయన తన రక్తములతో పాపాలను కడిగి క్షమాగుణాన్ని అందించారని అన్నారు. క్రీస్తు ప్రభువు పట్ల విశ్వాసము కలిగిన వారికిఆయన అనుగ్రహం ఎల్లవే ళలా ఉంటుందన్నారు. ప్రభువు చూపిన మార్గములో శాంతి, సహనం, పరస్పర సహకార గుణాలతో అన్ని వర్గాలు జీవించాలని సూచించారు.యేసుక్రీస్తు ప్రేమ, శాంతి, సహనానికి ప్రతీకగా నిలిచారని, ఆయన బోధనలు మానవాళికి మార్గదర్శకమని తెలిపారు. ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ పీటర్ సంఘ సెక్యూరిటీ. దిన్ కుమార్ సహా సెక్యూరిటీ విజయ్ కుమార్. కోశాధికారి జయ ప్రకాశం. సంఘ కమిటీ వారిలో ఇమ్మానియేల్ ప్రసన్నకుమార్ .గోపి ఎస్సే రవికుమార్ ప్రభుదాస్ గారు

# బలహీనపడుతున్న కమ్యూనిస్టులు..?

**కామ్రేడ్స్ ఇప్పటికైనా ఆలోచించండి..!**

**తక్షణం కావాల్సింది పునరేకీకరణే..!!**

**దండి వెంకట్**

**రాష్ట్ర అధ్యక్షులు**

**బహుజన లెఫ్ట్ పార్టీ (బహుజన కమ్యూనిస్టు)**
**బి ఎల్ పి**

**తెలంగాణ రాష్ట్ర కమిటీ, హైదరాబాద్.**





హైదరాబాద్ ఏప్రిల్ 5 (వార్త నిర్భయం) బ్రాహ్మణాధిపత్య పెట్టుబడిదారి విధానాలకు ప్రాతినిథ్యం వహిస్తున్న మోడీ నాయకత్వంలోని బీజేపీ కేంద్ర ప్రభుత్వం మూడవ సారి అధికారంలోకి రావడంతో ఆధిపత్య దోపిడి అరాచక శక్తులకు అడ్డుఅదుపు లేకుండా పోయింది. ఈ శక్తులకు వ్యతిరేకంగా నికరంగా పోరాటం చేయగలిగే సైద్ధాంతిక రాజకీయ శక్తి ఒక్క కమ్యూనిస్టులకు మాత్రమే ఉందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. కానీ కమ్యూనిస్టులు రోజురోజుకు బలహీనపడటం ఆందోళనకరమైన విషయంగా 90 ఉత్పత్తి కులాలకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, అగ్రకుల పేదలైన బహుజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 8 దశాబ్దాలు పూర్తి కావస్తున్నా స్వతంత్ర భారతదేశంలో రెండు సార్లు కేంద్రంలో కీలకమైన పాత్ర పోషించిన కమ్యూనిస్టులు, బెంగాల్, కేరళ, త్రిపుర రాష్ట్రాల్లో అవినీతి, బంధుప్రీతి ఆరోపణలు లేని పాలన కమ్యూనిస్టులది. మచ్చలేని పరిపాలన అందించిన ఘనత కలిగిన బలమైన కేంద్రాలుగా ఉన్న బెంగాల్, త్రిపుర చేజారిపోయాయి. త్వరలో కేరళలో జరగబోయే ఎన్నికల్లో ఉన్న ఒక్క ఆ రాష్ట్రం కూడా చేజారే ప్రమాదం ఉందని కొన్ని మీడియా స్థానాల్లో, సోషల్ మీడియాలో కథనాలు వస్తున్నాయి.ఈ పరిణామాలు కమ్యూనిస్టులనే కాదు, ప్రగతిశీల భావాలు కలిగిన వ్యక్తులు, సంస్థలను తీవ్రంగా కలచివేస్తున్నాయి. ఒకవేళ కేరళలో ప్రభుత్వం మారినా, ప్రభుత్వం వచ్చినా వామపక్ష పార్టీల్లో సైద్ధాంతిక రాజకీయ కార్యక్రమానికి భారతీయ తాత్విక దృక్పథం కలిగిన మహాత్మా జ్యోతిబా పూలే, అంబేడ్కర్, పెరియార్ సామాజిక విప్లవ తత్వాన్ని మార్క్సిజంతో జోడించకుండా ఇంకా వెయ్యి సంవత్సరాలైనా కేవలం మార్క్సిస్టు దృక్పథంతో కూడిన కార్యక్రమం ద్వారా మాత్రమే ఎలాంటి రాజకీయ మార్పును సాధించలేరనే విషయాన్ని గుర్తించాలి.మావోయిస్టులు మధ్య భారతంలో ఒక శక్తివంతమైన పార్టీగా భావించబడింది. "కగార్ ఆపరేషన్"తో మావోయిస్టులు కోలుకోలేని దెబ్బతిన్నారు. ఈ పరిణామాలన్నీ అభ్యుదయవాదులందరిని ఆవేదనకు గురి చేస్తున్నాయి.కమ్యూనిస్టులంతా నిజాయితీపరులని, నిస్వార్థపరులని, నిరంతరం ప్రజల హక్కుల కోసం పోరాడుతారని ప్రజలలో ప్రభలమైన విశ్వాసం ఉన్న విషయాన్ని ప్రత్యర్థులు సైతం అంగీకరిస్తారు.కాని కమ్యూనిస్టులు బలహీనపడితే దేశానికి చాలా నష్టం. కొత్త హక్కుల కోసం పోరాటాలు ఉండవు. పోరాడి సాధించుకున్న హక్కులను కోల్పోవాల్సి వస్తుంది. ఉద్యమాలు మందగిస్తాయి. లౌకిక వ్యవస్థను కాపాడటానికి జరుగుతున్న కృషి వెనుకపడుతుంది. సామాజిక న్యాయం, సమానత్వం కోసం సాగే పోరు సన్నగిల్లుతుంది. దేశపురోగతికి ఆటంకం ఏర్పడుతుంది.ఆధిపత్య దోపిడి వర్గాలకు వ్యతిరేకంగా నికరంగా నిలబడి పోరాడే శక్తివంతమైన సైద్ధాంతిక రాజకీయ త్యాగనిరతి కలిగిన కమ్యూనిస్టులు చీలికలు, పేలికలై ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్నారు. అభిమానులను దూరం చేసుకుంటున్నారు. కార్యకర్తలలో ఆత్మ విశ్వా సాన్ని పెంచలేకపోతున్నారు.చీలిపోయిన ఈ కమ్యూనిస్టులు ఇప్పటికైనా ఒకే సంస్థగా ఏర్పడకుంటే దేశ ప్రజలకు ఎంతో నష్టం. ఈ పరిణామాలన్నీ అగ్రకుల సంపన్న వర్గాలకు చెందిన దోపిడిదారులకు ఎంతో లాభం. రైతు, వ్యవసాయ కార్మిక, దళిత, గిరిజన, బీసీ, మైనార్టీలకు తీవ్ర నష్టం. మతోన్మాద, ఫాసిస్టు మనువాద శక్తులకు అడ్డు, అదుపు లేకుండా పోతుంది.కమ్యూనిస్టులు కోల్పోయిన విశ్వాసం తిరిగి ప్రజలలో కల్పించాల్సి ఉంది. అందుకు నేపాల్ కమ్యూనిస్టుల పునరేకీకరణ జరిగినట్లు ఇక్కడ జరగాల్సి ఉంది. నిజమైన కమ్యూనిస్టులెవరైనా బూర్జువా వర్గంలో చీలికలు తేవడానికి ప్రయత్నించాలి. పేదల, శ్రామికుల ఐక్యతకు కృషి చేయాలి. కమ్యూనిస్టులలో చీలికలు నివారించి పునరేకీకరణకు నడుంబిగించాలి.కానీ భారత కమ్యూనిస్టుల చరిత్ర యావత్తు ఆధిపత్య కులాల యాజమాన్యంలోని అగ్రవర్ణ/అగ్రకుల పెట్టుబడిదార్ల ప్రతినిధులైన కాంగ్రెస్, బీఆర్ఎస్, టీడీపీ, వైసీపీ లాంటి పార్టీలతో ఎన్నికల పొత్తులతోనే 8 దశాబ్దాల సమయం గడిచిపోయింది.మార్క్స్ కమ్యూనిస్టులను చీలమనలేదు. శ్రామికులను చీల్చి సొంత కుంపట్లు పెట్టుకోమనలేదు. వైవిధ్యాలున్న సమాజంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడం సహజమన్నారు. దేశానికి ఒక కమ్యూనిస్టు పార్టీ మాత్రమే ఉండాలని "కమ్యూనిస్టు ప్రణాళిక"లో స్పష్టంగా చెప్పడం జరిగింది.మెజారిటీ నిర్ణయాన్ని మైనారిటీ, పై కమిటీ నిర్ణయాన్ని క్రింది కమిటీ అమలు పరచడం ద్వారా పార్టీ ఐక్యత పరిరక్షించేందుకు చక్కని నిర్మాణ సూత్రాలు ప్రతిపాదించారు కామ్రేడ్ లెనిన్. మెజారిటీగా ఆమోదం పొందిన విషయాలపై పార్టీ విధానంలో భాగంగా ఉమ్మడి పార్టీ పెట్టాలని, ఏకీభావం రానివాటిని ప్రజాస్వామ్య పద్ధతుల్లో చర్చల ద్వారా కమిటీల్లో పరిష్కరించుకోవాలని లెనిన్ చెప్పారు.మార్క్సిజాన్ని నమ్మేవారందరూ ఒకే పార్టీగా ఉండి మెజారిటీ నిర్ణయాన్ని మైనారిటీ, పై కమిటీ నిర్ణయాన్ని కింది కమిటీలు అమలు చేయాలని లెనిన్ ఆచరించి చూపారు. ఇవన్నీ దృష్టిలో ఉంచుకొని చీలికలు, పేలికలైన నేపాల్ కమ్యూనిస్టులంతా పునరేకీకరణై బలమైన పార్టీగా అవతరించింది.అయితే ఇటీవల కాలంలో జరిగిన నేపాల్ పార్లమెంట్ ఎన్నికల్లో కమ్యూనిస్టులు ఓడిపోయినా తిరిగి అధికారంలోకి రావడానికి 90% అవకాశముంది.మార్క్సిజం తమ సిద్ధాంతంగా ఎంచుకున్న పార్టీల మధ్య ఉండేది చిన్న చిన్న మిత్ర విభేదాలు తప్ప శత్రు వైరుధ్యం కాదు. కాబట్టి పునరేకీకరణకు ఇది ఏమాత్రం అడ్డంకి కాదు.ఈ వెలుగులో భారత కమ్యూనిస్టులు ఆలోచించాల్సిన తరుణం వచ్చింది.సిద్ధాంతపరంగా మార్క్సిజాన్ని అంగీకరించి, ఉత్పత్తి సాధనాలను జాతీయం చేయడం, అధనపు విలువ దోపిడి కాకుండా సమాజపరం కావడం, అందరికీ విద్య, వైద్యం కల్పించడం, సామాజిక న్యాయం, సమానత్వం తదితర మౌలిక అంశాలపై ఏకీభావం ఉన్నవారంతా తక్షణమే ఒకే పార్టీగా పునరేకీకరణ జరగాలి. ఇవి కాక మరేమైనా ఏకీభావంలేని అంశాలుంటే పునరేకీకరణతో ఏర్పడిన పార్టీ ద్వారా పరిష్కారం చేసుకోవచ్చు.చీలికలన్నీ సిద్ధాంతపరంగానే జరిగినవని చెప్పడానికి ఎవరూ సహసించలేరు. తాము తప్ప అందరూ సిద్ధాంతరహితంగానే చీలారని చెప్పడం సహజం. తమ చీలిక మాత్రమే సరైందని, అనివార్యమైందని చీలిన ప్రతి పార్టీ/గ్రూపు సమర్థించుకుంటారు. విమర్శ, ఆత్మవిమర్శలు తమ ఆయుధాలని చెప్పుకున్నా ఆచరణలో అలా జరగడం లేదని అందరికీ తెలిసిందే.కమ్యూనిస్టుల చీలికలో వ్యక్తిగతాలు, అహంభావాలు, పదవీ వ్యామోహాలు అసలు లేవని చెప్పలేం. నాయకులుగా ఎంపిక కాగానే స్వీయ మానసిక ధోరణులు వాటంతటవే పోవు. కాలక్రమేణ అంతరించిపోతాయి. ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని పునరేకీకరణకు సిద్ధం కావల్సి ఉంటుంది.పునరేకీకరణకు నిర్దిష్ట సమయాన్ని నిర్దేశించు కోవాలి. అందుకు ఈ క్రింది ప్రాతిపదికన జరగాలి: విలీన మవుతున్న పార్టీలకు తగు ప్రాతినిధ్యం కల్పించాలి. పునరేకీకరణ కమిటీలు వేయాలి.ఒక సంవత్సరం లోపు ఐక్య పార్టీ ఏర్పాటు చేయాలి.నాలుగు నెలల్లో ప్రజాసంఘాల విలీనం పూర్తి కావాలి.ఎనిమిది నెలల్లో రాష్ట్ర స్థాయి కమిటీలు పూర్తి కావాలి.సంవత్సరం లోపు జాతీయ స్థాయిలో ఐక్య పార్టీ ఏర్పాటు కావాలి.ఒక సంవత్సరం సరిపోకపోతే ఇంకొంత సమయం తీసుకోవచ్చు. కాని లక్ష్యం, సమయం స్పష్టంగా ఉండాలి.కమ్యూనిస్టుల ఐక్యత అనేది అరిగిపోయిన రికార్డు లాగా అపహాస్యానికి గురైంది. మూడు దశాబ్దాలుగా ఐక్యత మాటలు వింటూనే ఉన్నాం. ఒక అడుగు ముందుకు వేయలేదు. అందుకే ఇప్పుడు కావాల్సింది పునరేకీకరణ, ఐక్య పార్టీనే.భారతీయ జనతా పార్టీ పాలన దేశాన్ని అధోగతికి తీసుకెళ్లింది. ప్రజల సంపదను అంబానీ, ఆదాని లకు కట్టబెడుతున్నారు. నిరుద్యోగం పెరిగింది. విద్య, వైద్యం ప్రజలకు అందుబాటులో లేకపోయాయి.మతోన్మాదం పెరుగుతోంది. మూడనమ్మకాలు తిరిగి వస్తున్నాయి. దేశాన్ని మధ్యయుగాలకు తీసుకెళ్లే పరిస్థితి ఏర్పడుతోంది.ఈ పరిస్థితిని గమనించైనా అభ్యుదయవాదులంతా ఐక్యం కావాలి. కమ్యూనిస్టులు పునరేకీకరణ జరిగి ఐక్య పార్టీగా విలీనం కాకపోతే చరిత్ర క్షమించదు.

# దళిత బాంధవుడు జగ్జీవన్ రావ్

**మేడ్చల్ పట్టణంలో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ 118 వ జయంతి వేడుకలు.**

**ఏ బ్లాక్ అధ్యక్షులు పానుగంటి మహేష్ కుమార్.**



మేడ్చల్ ఏప్రిల్ 5 (వార్త నిర్భయం)

మేడ్చల్ కిష్టాపూర్ డివిజన్ లో ఏ బ్లాక్ అధ్యక్షులు పానుగంటి మహేష్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా బాబు జగజ్జీవన్ రామ్ 118 వ జయంతి వేడుకలు నిర్వహించారు ఈ సందర్భంగా బాబు జగ్గజ్జివన్ రాం సేవలను స్మరించుకుంటూ ఆయనని స్ఫూర్తి గా తీసుకోవాలి అని అన్నారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా సి ఏ నవీన్ రెడ్డి పాల్గొన్నారు అలాగే మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉదండపురం సత్యనారాయణ మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి ,గుండ్ల పోచంపల్లి మున్సిపల్ అధ్యక్షులు సాయిపేట శ్రీనివాస్ , మార్కెట్ కమిటీ డైరెక్టర్ దుర్గం శంకర్ ,మాజీ ఉప సర్పంచ్ నర్సింహా రెడ్డి ,రామన్న రాఘవేందర్ గౌడ్ ,చీర్ల రమేష్ ,రామన్న సంతోష్ గౌడ్ ,మాజీ కౌన్సిలర్ నడికోప్పు నాగరాజు (చాపరాజు) , కౌడే మహేష్ ,ఐఠబిషి అధ్యక్షులు చంద్రయ్య గౌడ్ ,దుర్గం వెంకటేష్ ,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లవంగు రాకేష్ , చీర్ల ఆకాష్ , వేముల రంజిత్ రెడ్డి ,జీడిపల్లి శివ , జీడిపల్లి రామకృష్ణ ,తొంట యాదయ్య , తొంట సుధాకర్ ,పత్తి శంకర్ , పత్తి ఆంజనేయులు ,మిరియాల గణేష్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# కరెంటు షాక్ తో రైతు మృతి



ఏదుల మండలం ఏప్రిల్05 (వార్త నిర్భయం )



ఏదుల మండల కేంద్రంలో జరిగిన షాక్ న్యూస్ గుండ్యా వాల్యా నాయక్ తండ గ్రామపంచాయతీ కిచెందిన కాట్రావత్ లోకేష్ 45 సంవత్సరాలు వ్యవసాయం పొలం వద్ద ఈరోజు ఉదయం 6.30 కు కరెంటు షాక్ తో మరణించాడు వ్యవసాయ పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లి ప్రమాదానికి గురైనట్లు బిజెపి నేత తిరుపతి నాయక్ తెలిపారు ఏడాది క్రితం వరకు ఆయన పోస్ట్ మేనుగా పని చేసినారు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

**సమతా వాది, దళిత బాంధవుడు జగ్జీవన్ రామ్.**

**ప్రపంచ శాంతి సంఘం వనపర్తి జిల్లా సమన్వయకర్త ఎత్తం శివ,**




వనపర్తి బ్యూరో ఏప్రిల్ 5 (వార్త నిర్భయం)

సామాజిక న్యాయం కోసం పోరాడిన సమతావాది దళిత బాంధవుడు మహానేత జగ్జీవన్ రామని ప్రపంచ శాంతి సంఘం వనపర్తి జిల్లా సమన్వయకర్త ఎత్తం శివ, సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్ అన్నారు. వనపర్తి ఆఫీసులో జగ్జీవన్ రామ్ 119వ జయంతిని ప్రపంచ శాంతి సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీహార్ రాష్ట్రంలో దళిత వర్గాల్లో జన్మించిన ఆయన అంటరానితనం, కులవివక్ష ఎదుర్కొని ఎన్నో బాధను అనుభవించి దేశం ఉప ప్రధాని స్థాయికి ఎదిగి ఆదర్శంగా ఆదర్శంగా నిలిచారన్నారు. అంటరానితనం అసమానతలను రూపుమాపాలని జీవితకాలం పోరాడారన్నారు. సామాజిక న్యాయం సమసమానత్వం కోసం, దళిత వివక్షకు వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటం చిరస్మరణీయమన్నారు. సమతా వాదిగా, స్వాతంత్ర సమరయోధుడిగా, భారత ఉప ప్రధానిగా దళితులు బడుగు వర్గాల కోసం పనిచేసిన ఆయన స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, ఎన్ఎఫ్ఐ డబ్ల్యు పట్టణ కన్వీనర్ జయమ్మ, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి శేఖర్, ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి వంశీ, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

# బోధన్‌లో ఘనంగా 'హ్యుందాయ్ ఎక్స్‌టర్' ఫేస్‌లిఫ్ట్ ఆవిష్కరణ



బోధన్ పట్టణం ఏప్రిల్ 5 వార్త నిర్భయం :బోధన్ పట్టణంలోని ప్రకాష్ హ్యుందయ్ షోరూంలో శనివారం 'హ్యుందాయ్ ఎక్స్టర్' ఫేస్‌లిఫ్ట్ వాహనాన్ని వైభవంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని సీఈఓ నల్లా ప్రతీష్ రెడ్డి పర్యవేక్షించగా, ముఖ్య అతిథులుగా లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు బసవేశ్వర రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు దేశాయ్, ఉపాధ్యక్షులు విద్యాసాగర్, మున్సిపల్ వైస్ చైర్మన్ మీర్ ఇలియాస్ అలీ, కౌన్సిలర్ అలీమ్ రాజా, పెగడపల్లి సర్పంచ్ సుదర్శన్, కొప్పర్గా మాజీ సర్పంచ్ జమీల్ పటేల్, పావులూరి వెంకటేశ్వర్ రావు పాల్గొన్నారు. షోరూం మేనేజర్ రమేష్ పాటిల్ ఆధ్వర్యంలో అతిథులు వాహనాన్ని ఆవిష్కరించి టెస్ట్ డ్రైవ్ నిర్వహించి, కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా సీఈఓ నల్లా ప్రతీష్ రెడ్డి మాట్లాడుతూ సరికొత్త డిజైన్, ఆధునిక భద్రతా ప్రమాణాలు, వినూత్న ఫీచర్లతో ఎక్స్టర్ వాహనం వినియోగదారులను ఆకట్టుకునేలా రూపొందించామని, వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా పెట్రోల్, సిఎన్జీ వేరియంట్లలో వాహనం అందుబాటులో ఉందని తెలిపారు. బేసిక్ నుంచి టాప్ మోడల్ వరకు పలు వేరియంట్లు ఉండగా, ప్రారంభ ధర సుమారు రూ.10 లక్షల నుంచి ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో షోరూం సిబ్బంది, కస్టమర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**కాప్రా డివిజన్ శాంతి విల్లే కాలనీలో సిసి రోడ్డు పనులకు శ్రీకారం**

**- ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు బైరి నవీన్ గౌడ్ ..**



హైదరాబాద్ బ్యూరో, ఏప్రిల్ 5 (వార్త నిర్భయం)

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాప్రా మండలం కాప్రా డివిజన్ పరిధిలోని శాంతి విల్లే కాలనీలో రూ. 60 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్ల పనుల ప్రారంభ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బండారి లక్ష్మారెడ్డి సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాలనీల అభివృద్ధి తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని తెలిపారు.ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడం ద్వారా రవాణా సమస్యలు తగ్గి, జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని చెప్పారు. శాంతి విల్లే కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణంతో స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగం చేకూరుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు బైరీ నవీన్ గౌడ్, కాలనీ వాసులు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వరంగల్‌లో తెలంగాణ స్టేట్ మైనార్టీ హక్కుల పోరాట సమితి' ముఖ్య సమావేశం





వరంగల్ ప్రతినిధి ఎప్రిల్ 05 (వార్త నిర్భయం) తెలంగాణ స్టేట్ మైనార్టీ హక్కుల పోరాట సమితి వరంగల్. హన్మకొండ. జిల్లా ల ఆధ్వర్యంలో కార్యవర్గాల ఏర్పాటు మరియు బలోపేతం కోసం ఆదివారం నోబుల్ ఫన్షన్ హాల్ లొ ముఖ్యమైన సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంనికి సర్వర్ గజి అధ్యక్షతన వహించారు.ముఖ్య అతిథులు: రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ వాహబ్.. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ వాసీమ్. రాష్ట్ర లీగల్ సెల్ ఇంచార్జి డాక్టర్ షేక్ ఫహీముల్లాహ్. , రాష్ట్ర ఉపాధ్యక్షులు. సయ్యద్ అబ్దుల్ కరీం, రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ తాజుద్దీన్. తో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. వరంగల్ జిల్లా కన్వీనర్ హమీద్ షరీఫ్, హన్మకొండ జిల్లా కన్వీనర్ మహ్మద్ మొహియుద్దీన్.. ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు చెసారు.? మైనార్టీల హక్కుల పరిరక్షణ, వరంగల్ మరియు హన్మకొండ జిల్లాల్లో సంస్థాగత నిర్మాణం మరియు భవిష్యత్ కార్యాచరణపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా వరంగల్ నుంచి హమీద్ షరీఫ్. హన్మకొండ జిల్లా నుంచి ముహమ్మద్ మొహిబుద్దీన్. నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ వహబ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మైనార్టీ నాయకులు, మరియు మేధావులు పాల్గొన్నారు.

# కష్టపడి చదివి దేశానికి సేవ చేయాలి.

## -రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి.

వనపర్తి బ్యూరో ఏప్రిల్ 5 (వార్త నిర్భయం)

వనపర్తి పోటీ ప్రపంచాన్ని దృష్టిలో ఉంచుకొని బాగా కష్టపడి చదివి విద్యార్థులు దేశానికి సేవ చేసే ఆఫీసర్లుగా తయారు కావాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని మదర్స్ ల్యాప్ హైస్కూల్లో 19వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ ఒకప్పటి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో వనపర్తి పట్టణమే విద్యకు నిలయంగా ఉండేదని చెప్పారు. 2006 సంవత్సరంలో నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పాఠశాల కరస్పాండెంట్ ముబీన్ ఆహ్వాన మేరకు వచ్చి మదర్స్ ల్యాప్ హైస్కూల్ ను ప్రారంభించామని, అప్పుడు 50 మంది విద్యార్థులు ఉన్నారని, ప్రస్తుతం 850 మంది విద్యార్థులు స్కూల్లో విద్యను అభ్యసిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. పట్టణంలో ఉన్న ప్రముఖ ప్రైవేటు పాఠశాలల్లో మదర్స్ ల్యాప్ హైస్కూల్ ఒకటని అన్నారు. స్కూల్లో చదువుకునే విద్యార్థులు మీ భవిష్యత్తును రూపొందించుకోవడానికి ఒక విద్యాలయమే ఉన్నతమైందని చెప్పారు. పోటీ ప్రపంచంలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతున్నదని, విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. పాఠశాలల్లో విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల్లో కూడా ప్రాతినిధ్యం కల్పించాలని, క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని చెప్పారు. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా



ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, విద్యార్థులపై ప్రత్యేక నిఘా పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం స్కూల్ విద్యార్థులు చేసిన నృత్యాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అబ్దుల్ ముబీన్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ టిపిసిసి ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, నాయకులు సహదేవుడు, బాబా, కౌన్సిలర్ విజయలక్ష్మి, ఎత్తం చరణ్ రాజ్, బాలరాజు, సురేష్, రాంజీ నాయక్, గట్టురాజు, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు

# ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

, నిజామాబాద్ జిల్లా ప్రతినిధి , (ఏప్రిల్ 5)

వార్త నిర్భయం: భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో అదనపు డీసీపీ (అడ్మిన్) జి. బస్వా రెడ్డి, అదనపు డీసీపీ (సి.ఏ.ఆర్) కె. రామ్ చందర్ రావ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ లు మాట్లాడుతూ 1908 ఏప్రిల్ 5న బీహార్ లోని ఒక సాధారణ కుటుంబంలో జన్మించిన జగజ్జీవన్ రామ్ చిన్నప్పటి నుండే కుల వివక్షను, అంటరానితనాన్ని ఎదుర్కొన్నారు . విద్య ద్వారానే మార్పు సాధ్యమని , అంటరానితనాన్ని నిర్మూలించడానికి అణగారిన వర్గాలకు గౌరవాన్ని కల్పించడానికి ఆయన 1935లో అఖిలభారత అనగారిన వర్గాల లీగ్ ను స్థాపించారన్నారు. ఒక దేశంలోని బలహీన పౌరులకు సాధికారత కల్పించే వరకు ఆ దేశం నిజంగా స్వేచ్ఛగా ఉండలేదని ఆయన విశ్వసించారు. ఐదు దశాబ్దాలకు పైగా సాగిన ఆయన రాజకీయ జీవితం దేశానికి ఒక అనిర్వచనీయమమైన స్తంభంగా నిలిచిందాన్నారు.భారత రక్షణ మంత్రిగా కీలక పాత్ర పోషించారు. ఆ తరువాత ఉప ప్రధానిగా ఆయన పరిపాలన నైపుణ్యం, భారతదేశాన్ని తీర్చిదిద్దడంలో సహాయపడిందన్నారు. హరిత విప్లవంలో వ్యవసాయ మంత్రిగా ఆయన పోషించిన పాత్ర దేశ సంక్షేమం పట్ల ఆయనకున్న అంకితభావాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి అని , నిజాయితీకి, నిబద్ధతకు నిలువుటద్దంల నిలిచిన ఆయన జీవితం మనందరికీ స్ఫూరిదాయకం అన్నారు. ఈ




కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్ సతీష్ (వెల్ఫేర్, హోంగార్డ్స్), రిజర్వ్ ఇన్స్పెక్టర్ వినోద్ ( ట్రాఫిక్ ), స్పెషల్ బ్రాంచ్ ఎస్సైలు సంతోష్ రెడ్డి , సాయన్న , సిసిఅర్బీ ఎస్ఐలు శివరాం, విజయ్ కుమార్, పోలీస్ కార్యాలయ సూపరింటెండెంట్ శంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాతే కేబినెట్ కదలికలు.

## బీసీ నాయకులు, లంబాడి సామాజిక వర్గానికి రేవంత్ టీమ్‌లో చోటు!

హైదరాబాద్ ఏప్రిల్ 5 (వార్త నిర్భయం)

తెలంగాణ రాజకీయాల్లో కేబినెట్ విస్తరణపై ఆసక్తికర చర్చలు కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మంత్రివర్గంలో కీలక మార్పులు, చేర్పులకు సిద్ధమవుతున్నట్లు రాజకీయ వర్గాల్లో సమాచారం వెలువడుతోంది. అయితే ప్రస్తుతం ఐదు రాష్ట్రాల ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుండటంతో, హైకమాండ్ పూర్తి స్థాయిలో ఈ అంశంపై దృష్టి పెట్టలేకపోతున్నట్లు తెలుస్తోంది. అందువల్ల ఎన్నికల ఫలితాల తర్వాతే కేబినెట్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ వచ్చే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

### ఎన్నికల ఫలితాల తర్వాతే నిర్ణయం

కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం ఐదు రాష్ట్రాల ఎన్నికలపైనే దృష్టి కేంద్రీకరించింది. ముఖ్యంగా కేరళ, తమిళనాడు, అస్సాం, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికలు పార్టీకి అత్యంత కీలకంగా భావిస్తున్నారు. ఈ సమయంలో కేబినెట్ విస్తరణ చేపడితే పార్టీ లోపల అసమ్మతి స్వరాలు వచ్చే అవకాశం ఉందని, అందుకే ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకోవాలని అధిష్టానం భావిస్తున్నట్లు సమాచారం.

### పనితీరు ఆధారంగా భారీ మార్పులు

కేవలం ఖాళీగా ఉన్న ఒక మంత్రి పదవిని భర్తీ చేయడం మాత్రమే కాకుండా, ప్రస్తుతం ఉన్న మంత్రుల పనితీరును సమీక్షించి పెద్ద ఎత్తున మార్పులు చేపట్టేలా సీఎం ప్రణాళిక రూపొందించినట్లు తెలుస్తోంది. గత ఏడాది కాలంగా మంత్రుల పనితీరు, శాఖల పురోగతి, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై ఒక సమగ్ర నివేదిక సిద్ధం చేసినట్లు సమాచారం. పనితీరు తక్కువగా ఉన్న ఇద్దరు లేదా ముగ్గురు మంత్రులను తప్పించి కొత్త నాయకులకు అవకాశం ఇవ్వాలని సీఎం భావిస్తున్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.



### బీసీ, లంబాడి వర్గాలకు ప్రాధాన్యం

ఈసారి కేబినెట్ విస్తరణలో సామాజిక సమీకరణాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఇప్పటివరకు సరైన ప్రాతినిధ్యం లేని బీసీ నాయకులు, అలాగే లంబాడి సామాజిక వర్గం నుంచి ఒక ప్రతినిధికి మంత్రి పదవి ఇవ్వాలని సీఎం ఆలోచిస్తున్నట్లు సమాచారం. అదిలాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి వంటి కీలక జిల్లాల నుంచి ప్రాతినిధ్యం పెంచేలా టీమ్‌ను పునర్వ్యవస్థీకరించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత పరిస్థితులను సమీక్షించి, గ్రేటర్ ఎన్నికల ముందు కేబినెట్ విస్తరణ చేపట్టే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# ధర్పల్లికి కొత్త ఎస్సైగా కే.వినయ్ బాధ్యతలు

## ధర్పల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్సై మార్పు

## యువతకు మత్తు పదార్థాలపై ఎస్సై హెచ్చరిక



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, (ఏప్రిల్ 5):

(వార్త నిర్భయం) నిజామాబాద్ జిల్లా,దర్పల్లి ఎస్ఐగా కె.వినయ్ ఆదివారం నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్ఐ సామ శ్రీనివాస్ రెండు రోజుల క్రితం సెలవుపై వెళ్లగా.. జిల్లా కమిషనరేట్ నుండి వినయ్ కు దర్పల్లి ఎస్ఐగా ఉత్తర్వులు జారి చేశారు. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించడం అనివార్యమైంది. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ. ఎస్సై వినయ్ . మండల ప్రజల సహకారంతో నేరాలను జరగకుండా చూస్తానని, యువత పెడదారి పట్టకుండా, మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా తగు చర్యలు తీసుకుంటానని అన్నారు. ప్రజలు అసంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా చట్టాలను గౌరవించాలని కోరారు. వాహనదారులు తప్పనిసరి హెల్మెట్ ధరించాలని అన్నారుపేకాట, మరియు ఇసుక అక్రమ రవాణా మొరం, అనుమతి లేని వాహనాలు పట్టుబడితే కఠిన చర్యలు తప్పవు. పీడీ యాక్ట్ కేసు నమోదు చేసి. కఠినంగా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేకాట ఎక్కడైనా ఆడినచో వెంటనే ధర్పల్లి పోలీసులకు సమాచారం అందించాలని వివరాలు గోపియంగా ఉంచబడతాయని ఆయన అన్నారు. 24 గంటలు అందుబాటులో ఉంటాం పోలీస్ సేవలు వినియోగించుకోండి. ఎస్సై వినయ్ అన్నారు.

## అకాల వర్షంతో భారీగా పంట నష్టం

## బిజెపి మండల అధ్యక్షుడు నవీన్ వ్యవసాయ క్షేత్రంలో పరిశీలన





నిజామాబాద్ ప్రతినిధి ఏప్రిల్ 5

(వార్త నిర్భయం:) ధర్పల్లి మండలంలోని పలు గ్రామాలలో ఇటీవల కురిసిన వడగళ్ల వాన కారణంగా రైతులకు భారీ నష్టం వాటిల్లింది. ముఖ్యంగా పంట పొలాలు, మామిడి తోటలు కరెంటు తీగలు ట్రాన్స్ఫర్ తీవ్రంగా దెబ్బతిన్నాయి సేన్ల మీద. కృష్ణ మందిర్ ఏరియా, తమ్మిరోడు భాగు, దుబ్బాక తోవ, రేకులపల్లి తోవ, దమ్మన్నపేట తోవ, డీబీ తాండ, మరియా తండా, బిలియ తండా, ఇంద్ర నగర్ తాండ గోవిందపల్లి రామడుగు ధర్పల్లి మండలం ప్రాంతాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మనవి చేస్తున్నాము. అలాగే స్థానిక ఎమ్మెల్యే భూపతి రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి నష్టం అంచనా వేయించి, రైతులకు తక్షణ నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ , నేతలు రాష్ట్ర ప్రభుత్వమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

# డా. బాబు జగ్జీవన్ రామ్ భారతరత్న ఇవ్వాలి.

## మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వనపర్తి .




వనపర్తి బ్యూరో ఏప్రిల్ 5 (వార్త నిర్భయం)

భారత ఉప ప్రధానమంత్రి, స్వాతంత్ర సమరయోధుడు, ఆధునిక భారతదేశ నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన రాజకీయ దురంధరుడు, సుదీర్ఘ కాలం పార్లమెంట్లో సభ్యుడిగా దేశ ప్రజలకు విశేషమైన సేవలు అందించిన యోధులు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కి భారతరత్నం కేంద్ర ప్రభుత్వం వెంటనే భారతరత్న ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ డిమాండ్ చేశారు అంబేద్కర్ చౌక్ వనపర్తి జిల్లా కేంద్రంలో లో ఎమ్మార్పీఎస్ ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను నిర్వహించడం జరిగింది. ఈ వేడుకలలో ముఖ్యఅతిథిగా ఎం ఈ ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు గద్వాల కృష్ణ, మహానీయుల ఉత్సవ కమిటీ అధ్యక్షులు గంధం నాగరాజు మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు మాదిగ, ప్రజావాగ్దేయకారుడు రాజారాం ప్రకాష్, ఎమ్మార్పీఎస్ సమన్వయకర్త గంధం గట్టయ్య మాదిగ పాల్గొన్నారు .ఈ సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని ఎం ఈ ఎఫ్ వనపర్తి జిల్లా అధ్యక్షులు బోరెల్లి వెంకటయ్య, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మెంబర్లు ద్వారపోగు వెంకటేష్, విశ్వంబాబు, మదారి భోజరాజు, మెంటపల్లి రాములు సర్పంచ్, హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ గద్వాల ఆంజనేయులు, ప్రేమ్ కుమార్ ,రాహులు, శ్రీకాంత్ , వీరపాగ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## మాదాపూర్‌లో భయానక ప్రమాదం.

## స్కూటీని ఢీకొట్టి 5 కిలోమీటర్లు లాక్కెళ్లిన డీసీఎం -- యువతి మృతి



హైదరాబాద్ ఏప్రిల్ 5 (వార్త నిర్భయం) మాదాపూర్ ప్రాంతంలో ఆదివారం రాత్రి చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదం తీవ్ర కలకలం రేపింది. వేగంగా వస్తున్న డీసీఎం వాహనం స్కూటీపై వెళ్తున్న దంపతులను ఢీకొట్టి, వారిని దాదాపు 5 కిలోమీటర్ల దూరం వరకు లాక్కెళ్లిన ఘటన స్థానికులను భయాందోళనకు గురిచేసింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అయేషా (22), అబ్దుల్ బాసిత్ అనే దంపతులు స్కూటీపై ప్రయాణిస్తుండగా, మాదాపూర్ ప్రాంతంలో వెనుక నుంచి వచ్చిన డీసీఎం వాహనం వారి వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన తరువాత కూడా డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా ముందుకు సాగుతూ, స్కూటీని దాదాపు 5 కిలోమీటర్ల వరకు లాక్కెళ్లాడు.ఈ ఘటనను గమనించిన స్థానిక యువకులు వెంటనే అప్రమత్తమై, జూబ్లీహిల్స్ ప్రాంతంలో డీసీఎంను అడ్డుకుని ఆపారు. అనంతరం వాహనంలోని క్లీనర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అయితే, డ్రైవర్ మాత్రం అక్కడి నుంచి పరారయ్యాడు.ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దంపతులను స్థానికులు వెంటనే సమీప ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అయేషా మృతి చెందగా, అబ్దుల్ బాసిత్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న డీసీఎం డ్రైవర్‌ను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. నగరంలో పెరుగుతున్న నిర్లక్ష్య డ్రైవింగ్ ఘటనలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.